ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- నేడు సార్వత్రిక ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల ఏర్పాటు
- సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గంలో సర్వం సిద్ధమైంది. రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 మంది ఎన్నికల బరిలో నిలబడ్డారు. గుర్తింపు పొందిన పార్టీల నుంచి 11 మంది రేసులో నిలబడగా, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు నిలిచారు. ఎన్నికల సందర్భంగా ప్రచారాలు నిర్వహించిన అభ్యర్థులు తమకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రేపల్లె మున్సిపాలిటీతో పాటు రేపల్లె రూరల్, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలతో కూడిన రేపల్లె నియోజకవర్గంలో 2,27,232 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,11,071 మంది పురుషులు, 1,15,979 మంది మహిళలు, 13 మంది ఇతరులు ఉన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,642 ఓట్లు

నియోజకవర్గంలో 3,010 మంది ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులు, దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలలో 2,642 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో మిగిలిన 2,24,590 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికల నిర్వహణలో భాగంగా రేపల్లె నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా రేపల్లె పట్టణంలో 35, రేపల్లె మండలంలో 61, నగరం మండలంలో 54, చెరుకుపల్లిలో 60, నిజాంపట్నంలో 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 264 పోలింగ్ కేంద్రాలను 28 సెక్టార్లు, 28 రూట్‌లుగా విభజించారు. ఎన్నికల నిర్వాహణలో 1584 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ఆయా రూట్, సెక్టారులలో 28 మంది అధికారులు, 59 మంది మైక్రో అబ్జర్వర్‌లు, మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు విధులు నిర్వర్తించనున్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారితో పాటు నలుగురు అదనపు సిబ్బందిని నియమించారు. 264 పోలింగ్ కేంద్రాలలో 51 కేంద్రాలను అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా, 164 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి మొత్తం 215 కేంద్రాలలో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు లైవ్‌వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఆరోగ్యశాఖ విధులు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు ఏమాత్రం అస్వస్థతకు గురైన వెంటనే ప్రాథమిక చికిత్సలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాలలో ఏఎన్‌ఎంలను ఏర్పాటు చేయటంతో పాటు అవసరమైన మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, తాగునీటి వసతులను ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తెలిపారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

ఎన్నికల విధులకు పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు పోలింగ్ కేంద్రాలలో పోలీసులను పహారాకు నియమించారు. ఎన్నికల విధుల్లో ఒక ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలతో పాటు 520 మంది ఎన్నికల విధులకు హాజరుకానున్నారు. దీనిలో 404 మంది సివిల్ పోలీసులు కాగా 104 మంది బీఎస్‌ఎఫ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నట్లు డీఎస్పీ టీ.మురళీకృష్ణ చెప్పారు. 264 పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ బూత్‌ల వద్ద అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉండి ప్రశాంత వాతావరణంలో ఓటు చేసే విధంగా ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆయా పార్టీలకు సంబంధించి గుర్తులు ప్రదర్శించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కర్లపాలెం: మండలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దార్ నిర్మలా నందబాబా ఆదివారం తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలో మొత్తం 40,976 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. కర్లపాలెం మండలంలో 122వ బూత్ నుంచి 168వ బూత్ వరకు మొత్తం 47 పోలింగ్ బూత్‌లను ఎన్నికలకు సిద్ధం చేశామని చెప్పారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమవుతుందని ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామని కర్లపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు తెలిపారు. ఇరువురు సీఐలతో పాటు పలువురు ఎస్ఐలు, వందలాది మంది సిబ్బంది, ఎన్నికల విధులు నిర్వహిస్తారని తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వ యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు సమాయత్తమైంది. మండలంలోని 54 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని సిబ్బందికి అందజేసి ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బందిని తరలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. బూత్‌ల వద్ద ఎన్నికల నిబంధనలను అనుసరించి చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలను అధికారులు చేపట్టారు. పోలింగ్ సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన ఏజంట్లకు సైతం గుర్తింపు కార్డులు మంజూరు చేసిన ఎన్నికల అధికారులు ఆయా బూత్‌ల వద్దకు నిర్ణీత సమయానికి చేరుకొని మాక్ పోలింగ్ పరిశీలనలో పాలుపంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్ల సౌకర్యం కోసం కేంద్రాల పరిధిలో మంచినీటి సదుపాయం కల్పించడంతో పాటు, ఓటర్లు ఎండ తాకిడికి గురవ్వకుండా టెంట్లను ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులకు గురికాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ట్రైసైకిళ్లను అందుబాటులో ఉంచారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నానికే ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వారికి మౌలిక వసతులు ఏర్పాట్లు చేశారు. భట్టిప్రోలు మండలంలో 48 పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఓటర్ల కోసం టెంట్లను ఏర్పాటు చేశారు.



రేపల్లెలో ఎన్నికల విధులకు వచ్చిన పోలింగ్ సిబ్బంది

ఎన్నికల మెటీరియల్ పంపిణీ పూర్తి

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి మెటీరియల్ పంపిణీకి ఆదివారం ఉదయం నుంచే ఏర్పాట్లు చేసినట్లు వేమూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు తెలిపారు. భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద నుంచి ఆదివారం సిబ్బంది మెటీరియల్‌ను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వసంతరాయుడు మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, అమృతలూరు, కొల్లూరు, చుండూరు, వేమూరు మండలాల పరిధిలోని 233 పోలింగ్ కేంద్రాలకు సెక్టార్ల వారిగా మెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. ఇందుకుగానూ 1500ల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. సోమవారం ఎన్నికలు ముగిసేత వరకు నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.



సిద్ధంగా ఉంచిన ఈవీఎంలు



పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రితో తరలి వెళ్తున్న సిబ్బంది



సిద్ధమైన ఎంవి రాజుపాలెం పోలింగ్ కేంద్రం



రేపల్లెలో పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఓ హెలా షారోన్



భట్టిప్రోలులో ఎన్నికల విధులకు చేరుకున్న సిబ్బంది

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్ వద్ద గుమిగూడిన జనం



మృతి చెందిన దున్నా శ్రీధర్

భట్టిప్రోలు: ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన భట్టిప్రోలు మండలం పెదలంక మధ్య గూడెంలో చోటు చేసుకుంది. మధ్యగూడెంకు చెందిన దున్నా శ్రీధర్(35) ఆదివారం ఉదయం ఇసుక లోడుతో పెదలంక నుంచి వెల్లటూరు వెళుతున్నాడు. చింతమోటు స్మశాన వాటిక దగ్గరకు వచ్చే సరికి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న శ్రీధర్ ట్రాక్టర్ కింద పడి మృత్యువాతకు గురయ్యాడు. సమాచారం మేరకు ఎస్ఐ కాసుల శ్రీనివాస రావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రొక్లయినర్‌తో ట్రాక్టర్‌ను బయటకు తీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



ప్రమాదంలో కారు ముందు భాగంలో ఇరుక్కుపోయిన మోపెడ్




మృతి చెందిన తిరుపతయ్య

చేబ్రోలు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో వృద్ధుడు మరణించిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ తిరుపతయ్య (64) గుంటూరులో నిర్మాణంలో ఉన్న పెట్రోలు బంకుకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ముట్లూరు నుంచి తన మోపెడ్‌పై గుంటూరు వస్తుండగా నారాకోడూరు, బుడంపాడు మధ్య ఓ దాబా సెంటర్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తిరుపతయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కారు ముందుభాగంలో టీవీఎస్ వాహనం ఇరుక్కుపోయింది. ప్రమాద సంఘటనపై చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

తాటికాయలు కోసే విషయంలో వివాదం

పెదకాకాని: తాటికాయలు కోసే విషయంలో ఇరుగ్రామాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన మేకల అశోక్ గత కొంతకాలంగా తాటి ముంజలు విక్రయిస్తున్నాడు. తాటి కాయలు కోసేందుకు ఆదివారం మరో ముగ్గురితో కలసి కొప్పురావూరు గ్రామ శివారు ప్రాంతంలోని కంతేరు వెళ్లగా కొందరు టీడీపీకి చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. వెంటనే కంతేరు గ్రామంలోని స్నేహితులను మరికొంత మందిని ఫోన్ చేసి పిలిపించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది, కొప్పురావూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువకులపై రాళ్ళు, సీసా పెంకులతో దాడి చేశారు. దాడి చేసిన వారిలో కంతేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు, యువత ఉన్నట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన వారిలో మేకల అశోక్, విజయ్, కొమ్ము రమేష్, బుల్లా దిలీప్, బలిజేపల్లి ప్రశాంత్‌కుమార్ ఉన్నారు. సంఘటనా స్థలానికి తాడికొండ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

బియ్యం, సరుకులు పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులకు తమ వంతుగా సహాయం అందించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. నెలా నెలలో భాగంగా ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు 13 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి కూర్నాల హరివెంకటసతీష్ మాట్లాడుతూ సమితి తరపున ఎంతో కాలంగా పేదలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కూరపాటి లీలాకర్, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్, టి.మురళీ సాయి, పల్లంపాటి రజనీశ్వరరావు, టీజీ సారథి, మాజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కర్లపాలెం ఎస్సై సస్పెన్షన్

కర్లపాలెం: కర్లపాలెం ఎస్సై జనార్ధన్‌ను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సస్పెండ్ చేసినట్లు బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు ఆదివారం తెలిపారు. గణపవరం గ్రామానికి చెందిన రాజేష్ తనపై ఎస్ఐ జనార్ధన్, వైఎస్సార్ సీపీ నేతలు కొంతమంది దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ సంఘటనపై ఎస్సైను ఎస్పీ సస్పెండ్ చేశారని ఆయన తెలిపారు.

186 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలో 186 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని వట్టిచెరుకూరు మండలంలో 31 కేంద్రాల్లో, గుంటూరు రూరల్‌లో 75, ప్రత్తిపాడులో 35, పెదనందిపాడులో 18, కాకుమానులో 27 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి కావాల్సిన ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇతరత్రా వసతులను సిద్ధం చేశారు.

అమల్లో 144 సెక్షన్

ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్లకు వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రత్తిపాడు సీఐ ఎండీ నిషార్ బాషా తెలిపారు. ఈనేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఆవరణలో ముగ్గురు లేదా నలుగురి కన్నా ఎక్కువగా గుమిగూడవద్దని సూచించారు. ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా ఉపేక్షించని చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



తెనాలి: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజి రోడ్డులోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సాతులూరి రామ్‌ప్రసాద్, క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, క్లబ్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, అయినాల మల్లేశ్వరరావు, నంబూరు శ్రీకుమార్, మున్సిపల్ కార్మికులు బి.సంధ్యారాణి, ఆర్.కనకలక్ష్మి, ఎం.రోజారమణి, ఫ్రాన్సి, కంచర్ల భోజరాజు (ఏలియా) పాల్గొన్నారు. క్లబ్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, సుమతి దంపతుల వివాహం సందర్భంగా ఈ వితరణ చేశారు.

జగనన్న సంకల్పం..సొంతింటి కల సాకారం

జీవితంలో సొంతింటి కల కల్లగానే మిగిలిపోతుందని నైరాశ్యంలోకి వెళ్లిపోయిన పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారు. ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారం చేయటమే తన ధ్యేయంగా ప్రకటించి కార్యరూపం దాల్చేలా చేశారు. తత్ఫలితంగా పేదలు సొంతింటి వారయ్యారు. తమ చిరకాల కోరికను నెరవేర్చిన జగనన్న పది కాలాల పాటు చల్లగా ఉండాలని తిరిగి జగనన్నే సీఎంగా రావాలని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

- సీఎం వైఎస్ జగన్ పాలనలో నెరవేరిన పేదల సొంతింటి కల
- నియోజకవర్గంలో 12,443 మందికి 290 ఎకరాల స్థలం కేటాయింపు
- కేటాయించిన స్థలాల్లో జోరందుకున్న ఇళ్ల నిర్మాణాలు
- 3009 గృహాలతో మెగా సిటీగా మారనున్న జగనన్న కాలనీ



కాలనీలో పూర్తయిన ఇంటి నిర్మాణాలు

రేపల్లెరూరల్: జగనన్న సంకల్పంతో పేదల కల నెరవేరింది. ప్రతి పేదవానికి సొంతింటి కల కలగానే మిగిలిపోయిన పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంకల్పంతో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కృషితో పట్టణంలో మరో మెగా సిటీ ఆవిర్భావానికి పునాదులు పడ్డాయి. రేపల్లె నియోజకవర్గంలో 290 ఎకరాలలో రూ.20.17 కోట్లు వెచ్చించి 12,443 మంది లబ్ధిదారులకు నివేసన స్థలాలు అందించారు. దీనిలో భాగంగా రేపల్లె పట్టణంలో 66 ఎకరాల సింగిల్ లేఅవుట్‌లో 3,009 మంది లబ్ధిదారులకు, రేపల్లె మండలంలో 50 లేఅవుట్‌లలో 43 ఎకరాలలో 1826 మంది లబ్ధిదారులకు, నగరం మండలంలో 69 ఎకరాలలో 3,143 మందికి, నిజాంపట్నం మండలంలో 74 ఎకరాలలో 3,250, చెరుకుపల్లి మండలంలో 38 ఎకరాలలో 1215 మందికి నివేశన స్థలాలు అందించారు.

మెగాసిటీగా మారుతున్న జగనన్న కాలనీ

పట్టణంలో 66 ఎకరాల్లో టౌన్‌ప్లానింగ్ నిబంధనలతో విశాలమైన రోడ్లతో 3009 ప్లాట్లతో నివేశనా స్థలాలు అందించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశారు. ఇప్పటికే 1248 గృహాల నిర్మాణాలు పూర్తి చేసి నివాసాలు ఉండే పరిస్థితి కల్పించారు. వివిధ దశల్లో 628 గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయి. 1133 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ప్రత్యేక ప్రణాళికలు

నివేశనా స్థలం పొందిన ప్రతి కుటుంబం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలో ఏడుగురు నోడల్ అధికారులను నియమించి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వార్డుల్లోని కౌన్సిలర్లు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది, మెప్మా అధికారులతో నిరంతరం ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేని కుటుంబాలకు ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వస్తుండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు మొగ్గుచూపుతున్నారు.



జగనన్న కాలనీలో వేగవంతంగా జరుగుతున్న గృహ నిర్మాణ పనులు

సొంతింటి కల నెరవేరింది



సొంతింటి కల నెరవేరుతుందని ఊహించలేదు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా వాగ్దానాలు చేయటం అధికారం చేపట్టగానే వాగ్దానాలను మరిచిపోవటం చూశాము. ఎన్నికల సమయంలో జగనన్న ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటంతో పాటు పేదల పక్షపాతిగా మా సొంతింటి కల నెరవేర్చాడు.

– లోకేశ్వరరావు, 11వవార్డు, రేపల్లె టౌన్

జగనన్న రుణం తీర్చుకోలేము



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మా కల నెరవేర్చారు. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే మాకు సొంతింటి కల నెరవేరటం ఆనందంగా ఉంది. పేదల కష్టాలు తెలిసిన జగనన్న ముఖ్యమంత్రి కావటం మా పాలిట వరం. ఎన్నికల్లో జగనన్నకు తోడుగా నిలిచి ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– బర్మా రాధ, 8వ వార్డు, రేపల్లె టౌన్

అద్దె ఇంటిలో అవస్థలు



ఇద్దరు పిల్లలతో వ్యవసాయ పనులు చేసుకుని అద్దె ఇంటిలో తీవ్ర ఇబ్బందులు పడ్డాము. అన్నలా మా కుటుంబానికి అండగా నిలిచి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునే విధంగా చేసిన మా అన్న జగనన్నకు రుణపడి ఉంటాం. మనసున్న జగనన్నకు మా కుటుంబం అండగా నిలుస్తుంది.

– బత్తుల మేరి, 8వ వార్డు, రేపల్లె టౌన్

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



వెల్లటూరులో శంకర జయంతి వేడుకల్లో అర్చకులు



భట్టిప్రోలులో శంకరాచార్యుని జయంతి వేడుకల్లో ఆశ్రమ నిర్వాహకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): శ్రీ ఆదిశంకరాచార్యుల వారి జయంతి పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని శంకర మఠంలో ఆదిశంకరాచార్యుల వారికి ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. శారదా అమ్మవారికి విశేష పూజ, కుంకుమార్చన, మల్లెల పూజ శాస్త్రయుక్తంగా జరిపారు. శంకరమఠం ప్రధాన అర్చకులు చందూ మాస్టార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 12 ఏళ్ల చిరు ప్రాయంలోనే ఇంటిని విడిచి యావత్ భారత దేశాన్ని కాలి నడకన సంచరించి నలు దిక్కులా పీఠాలను స్థాపించి తన బోధనలతో భరత భూమిని వెలుగులతో నింపిన ఆధ్యాత్మిక తేజోమయ జ్యోతి జగద్గురు శ్రీ ఆది శంకరా చార్యుల వారని వక్తలు కొనియాడారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఆదిశంకరాచార్యులు జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి మాట్లాడుతూ వేదాంత రహస్యాన్ని మానవుడు తరించేందుకు ప్రబోధం చేసిన మహనీయుడు శంకరాచార్యులని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.యశోద, పి.దేవసేన ఆండాళ, బి. రాజరాజేశ్వరి, ఎం.శశికళ, బి.హేమ పద్మ, డి.శశికళ పాల్గొన్నారు.

జగద్గురువు ఆదిశంకరాచార్యులు

భట్టిప్రోలు: వేదాలు, శాస్త్రాలకు వక్ర భాష్యం చెబుతూ హిందూ ధర్మం శాఖలుగా విడిపోతున్న నేపథ్యంలో హిందూ ధర్మ ఐక్యత కోసం అద్వైతాన్ని ప్రబోధించిన మహానుభావుడు ఆదిశంకరాచార్యులని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలోని రామ మందిరంలో జగత్ గురువులు ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమ శంకరరావు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. శంకరాచార్యులు కాలినడకన దేశమంతటా తిరిగి అష్టాదశ పీఠాలను స్థాపించి హిందూ ధర్మ ఐక్యత కోసం కృషి చేసి 32 ఏళ్లకే పరమపదించి మనలో స్ఫూర్తి నింపిన మహానుభావుడని కొనియాడారు. కొంత మంది మాత్రమే వేదాలను చదవాలని సమాజంలో ఉన్నప్పుడు రామానుజాచార్యులు గురువు ఉపదేశించిన నారాయణ మంత్రాన్ని పామరులందరికీ అందజేసి విశిష్టాద్వైతాన్ని ప్రబోధించి దేశంలో పీఠాలు స్థాపించిన సమతా మూర్తి అని పేర్కొన్నారు.



శ్రీ ఆది శంకరాచార్యులు